




**-7-**

# ప్రబంధ పరమేశ్వరుడు - ఎర్రన

"భారతకావ్యహార మొక భాగము నన్నయభట్టొనర్చె ము
క్తరమణీయ వాక్యముల దక్కిన భాగము సోమయాజి సొం
పార నొనర్చె రెండుగలయన్ శివదాసుడు మధ్యనాయక
శ్రీ రచియించె శారద ధరింప గవిత్రయ కీర్తి మించగన్"॥

తెలుగు మహాభారతమును నన్నయ భట్టు మొదలుపెట్టి, అరణ్యపర్వముతో ఆపెను. తిక్కన ఆ పర్వము వదిలి మిగిలిన భాగమంతయు పూరించెను. నడిమిన మిగిలిన ఈ కొద్ది భాగమును తెనుగీకరించి, వారధి కట్టినందున ఎర్రన "ప్రబంధ పరమేశ్వరుం"డయ్యెను.

తెలుగునాట వేంగినాడును చోడులు పరిపాలించే సమయములో, ఋషి వంటి ఎరపోత సూరి వుండేవాడు. వీరి తాత భీమన మంత్రి, చోడులకు ప్రగడగా పనిచేశారు కూడా. ఈ ఎరపోతసూరి నారసింహ భక్తుడు. ఈయన మనుమడు ఎర్రన. వీరు శ్రీవత్స గోత్రీయులు, నియోగులు.
కొద్దిగా అటూఇటుగా క్రీ.శ. 1280 ప్రాంతములో జన్మించిన ఈ ఎర్రన, శివభక్తుడు. తల్లి పోతాంబ. తండ్రి సూరన్న. వీరు చదలవాడ ప్రాంతము వారైనా, గూడ్లూరు చేరినారు. ఎర్రనకు శంకరస్వామి అనే గురువు వుండేవాడు. ఆ

గురువు మునీంద్రుని వంటివాడు. నిత్య శివరాత్రి వ్రతము ఆచరించేవాడు. ఎర్రన గురువు వద్ద వుంటూ "శంభుదాసు"డనే బిరుదునామము పొందాడు.

ఎర్రన ఉభయభాషా కవిత్వ రహస్యాలు చిన్నతనమునే నేర్చాడు.
కవి పండిత వంశము కాబట్టి ఎర్రన చిన్నతనముననే భారతము తెలుగులో లభ్యమైనంతగా చదివి వున్నాడు.
చిన్నతనము నుంచే తనుంటున్న గూడ్లూరులోని నీలకంఠేశ్వర స్వామి మీద ఎర్రన కొన్ని పద్యాలు బాల్యములో చెప్పివున్నారు.
వాటిలో జటిలమైన సమాస కల్పనలు కనబడుతాయి.

"నిను సేవించిన గల్గు మానవులకున్ వీటీవధూటీ ఘటీ
ఘనకోటీశ కటీకటీ తటిపటీ గంధేభ వాటీపటీ
రసటీ హారికటీ సువర్ణమకుటీ ప్రచ్ఛోటికాపేటికల్
కన దామ్నాయమహాతురంగ! శివలింగా నీలకంఠేశ్వరా!!"

ఇంతటి జటిలమైన కవిత్వము ఎర్రన కవితా పటుత్వము తెలుపుతుంది.
ఈ శైలి తరువాతి పెద్దన్నాదులకు మార్గదర్శకమైనది.

ఎర్రన సకలభాషా కవిత్వ విశారదుడు. అతులాను భావభవ్యుడు. ప్రబంధ రచన సహజముగా అబ్బినదీయనకు.
ప్రోలయవేమారెడ్డి రెడ్డివంశపు రాజు పాలిస్తుండగా, ఆయన తమ్ముడు మల్లారెడ్డి చదలవాడకు రాజప్రతినిధిగా వుండెను.
ఈ మల్లారెడ్డికి ఎర్రనకు స్నేహము. అక్కడే మహాభారత అరణ్యపర్వ శేషము పూరించబడింది.

నన్నయ్య చేత ప్రారంబించబడిన, తిక్కనచే తరువాతి భాగమంతయు పూరించబడినా, నడిమిన మిగిలిన ఆ కొద్ది భాగం నిలిచిపోయినది. అది అసంపూర్ణంగా కనబడుతూ ఉన్నది. మూడు వందల ఏళ్ళ తరువాత అది ఎర్రన చేత పూర్తి కావించబడింది.

"భవ్య చరిత్రు డాపస్తంభ సూత్రుండు శ్రీవత్స గోత్రుండు శివపదాబ్జ

సంతత ధ్యాన సంసక్త చిత్తుడు సూర్యనార్యునకు బోతమాంబికకును
నందనుడుల బాకనాటిలో నీలకంఠేశ్వర స్థానమై యెనక మెసగు
గూడ్లురు నెలవుగ గుణ గరిష్ఠత నొప్పు ధన్యుడు ధర్మైక తత్పరాత్ము
డెఱ్ఱనార్యుడు సకల లోకైక విదితుడయిన నన్నయ భట్ట మహా కవీంద్రు సరస
సారస్వతాంశ ప్రశస్తి దన్ను, జెందుటయు, సాధు జన హర్ష సిద్ధి గోరి
ధీర విచారుడు తత్కవితా రీతియు గొంత దోప దద్రచనయకా
నారణ్యపర్వ శేషము; పూరించె గవీంద్ర కర్ణపుట పేయముగాన్" (అరణ్య...7-469;470)

నన్నయ్య అరణ్యపర్వంలో మూడుశ్వాసాలు పూర్తిగా చెప్పి నాలుగవ అశ్వాసములో 142 పద్యము తరువాత ఆగినాడు . భారత ప్రతులన్నింటిపో 143 వ పద్యము వద్ద 'ఎర్రన కవిత్వము' అని వ్రాసి వుంటుంది.

ఎర్రన మొదలు పెట్టిన పద్యము...

'స్ఫురదరుణాంశు రాగరుచి బొంపిరివోయి నిరస్త నీరదా
వరణములై దళత్కమల వైభవ జృంభన ముల్లసిల్లను
ద్దుర తర హంససారస మధువ్రతనిస్వముల్ సెలంగగా
గరము వెలింగె వాసర ముఖంబులు శారదవేళ్ళ జూడగన్" (అరణ్య 4-143)

'ప్రబంధ పరమేశుడనంగ నరణ్యపర్వ శేషోన్నయ మంద్రభాష సుజనోత్సవ మొప్పగ నిర్వహించి' నట్లుగా ఎర్రన నృసింహ పురాణ పీఠికన చెప్పుకునేవాడు. నన్నయ రాయలేని భాగాన్ని ఎర్రన పూరించాదన్న భావము ఇందులో కనపడుతున్నది. నన్నయను కొంత అనుసరిస్తూ అతని రచనలాగా వుండే ప్రయత్నము చేశాడు ఎర్రన. అనుకరణ శైలిలో తప్ప భావములో లేదు. నన్నయ ఇతిహాస శైలినే కాక తిక్కన భావ గతినీ అనుకరించి పర్వము పూరించాడు ఎర్రన. ఈ విధమైన అనుకరణ వల్ల నన్నయ శైలిలో మొదలుపెట్టి తిక్కన శైలి పూరించి వారధి కట్టాడు ఎర్రన. నన్నయ శైలి అయిన ప్రసన్న కథాకలితార్థయుక్తి, భాషాప్రయోగ సౌందర్యము మొదలైన లక్షణాలతో పాటూ, తిక్కన నాటకీయత, మనఃప్రవృతి నిరూపణ, పాత్ర చిత్రాది కవితా శిల్పాలను గ్రహించి చేసిన స్వతంత్ర రచనలా వుంటుందీ భాగము.

భారత భాగములో ఎర్రన పూరించిన భాగాలు;

కృష్ణమార్కండేయాగమనం, బ్రాహ్మణప్రభావ కథనం, సరస్వతీ గీత, వైవస్వతు చరిత్ర, కల్పంత ప్రకారం, యుగధర్మ కీర్తనం, కామ్యాశ్వహరణం, ఇంద్రద్యుమ్నోపాఖ్యానం, దుందుమార చరిత్ర, పతివ్రతాచరిత్ర, ధర్మవ్యాదుడు చెప్పిన ధర్మాలు, అగ్నివంశాను కీర్తన, కుమార సంవాదం, సత్య ద్రౌపదీ సంవాదం, పాండవులు ద్వైతవనం చేరటం, ధృతరాష్ట కార్యాలు, దుర్యోధనాదుల దుర్మంత్రం, ఘోషయాత్ర, కౌరవ గంధర్వయుద్ధము, దుర్యోధనాదుల చెర, అర్జునుడు వాళ్ళని విడిపించము, దుర్యోధనుడు ప్రాయోపవేశం, పాతాళ గతులైన దానవులు, దుర్యోధనుని వైష్ణవయాగ ప్రవర్తన అతడ్డి అశ్వాసించటము, పాండవులు కావ్యకవనం మళ్ళీ చేరటం, వ్రీహిద్రోణాఖ్యానం, ద్రౌపది హరణం, సైంధవ పరాభవం, రామాయణములో రామరావణ జననం, రాముని వన ప్రస్థానం, సీతాపహరణము, సుగ్రీవ మిత్రత్వం, వాలి వధ, త్రిజట స్వప్నం, రావణ దుష్ట వచనాలు, సీతాన్వేషణ, లంకాభిగమనం, రామరావణ యుద్దం, రాఘువాభ్యుదయం, సావిత్రీ చరిత్ర, కర్ణునికి సూర్యుని హితోపదేశం, కరుణని జన్మ కథ, ఇంద్రుడు కవచ కుండలాలు, అరణీయం, యక్షప్రశ్నలు, ధర్ముని వరాలు.

మొత్తం 1595 గద్యపద్యాలతో భారత శేషాన్ని పూరించాడు ఎర్రన. తెనుగీకరించటములో తెలుగుతనాన్ని తెచ్చాడు. మూలానికి విధేయత చూపటములో తిక్కనకు దగ్గరగా వున్నారు ఎర్రన. సావిత్రీ చరిత్రలో వారు అక్కడక్కడ మూలములో లేని భావాలను చెప్పారు. సత్యవంతుని తండ్రి అంధుడు. సావిత్రి కోరిన వరము వల్ల అతనికి కళ్ళు వస్తాయి. అతనికి కళ్ళు రాగానే కొడుకు కోసము వెతికాడు. కనపడలేదు. 'కన్నులు లేని యట్లోకడకుగానక యేడ్చెసతీసమేతుడై" అని చెపుతారు ఎర్రన. అరణ్యపర్వములో సావిత్రీ చరిత్ర ఒక చిన్న ప్రబంధములా మలచాడు ఎర్రన. ఇలా రాయబట్టే 'ప్రబంధ పరమేశ్వరుడ'య్యాడు.

ఎర్రన, నన్నయ మార్గములో కథా విధానాన్ని పాటించి తన కిష్టమైన ప్రబంధ విధానాన్ని అరణ్యపర్వ శేష రచనలోనే ప్రవేశపెట్టినాడు. మూలానికి మెరుగులు పెట్టే ఔచిత్య పరిపోషకాలైన భావాలను అక్కడక్కడా ప్రదర్శించడం వల్ల, పురాణ కవిత్వములో వర్ణనాత్మకశైలి ప్రవేశపెట్టడం వల్ల ఎర్రనకు 'ప్రబంధ పరమేశ్వర' బిరుదు వచ్చివుండవచ్చు. పొందికైన మాటలలో ఆయా సందర్భాలకు తగినట్లుగా వివిధ విచిత్ర రీతులను కల్పించుకొని వాటిలో అపూర్వ సాహిత్య శిల్ప నిర్మాణము సాధించిన కొద్ది మంది కవులలో ముఖ్యుడీ 'ప్రబంధ పరమేశ్వరుడు'.

ఎర్రన భారత పర్వశేషమును పూరించటమే కాక, హరివంశము, రామాయణము, నృసింహపురాణమనే గ్రంధాలను కూడా రచించినాడు. రామాయణం నష్టమైనది. కొన్ని పద్యములు మాత్రం అచ్చటచ్చట దొరికినవి.

ఎఱ్ఱన  తన రచనలలో సామెతలు, జాతీయాలు వాడటములో సిద్ధహస్తులు.  అరణ్య పర్వ శేషములో ఆయన వాడినవి; నోరరుగంగ ప్రేలుట (4–197), ఎరువు సతమగున్(4–347), కొరవిగొని వె్రనే తలగోకికొనగ(5–19) శుభం బిచ్చునె చావులెందుకు(6–53), ఏనుగకు సిళ్లు చూపడం (6–175), పులిగోలంగొని వ్రేయడం(6–177), చెయ్యిపెట్టి కలచినట్లు అవడం(6+194), వీనులు గొరవింగొని చూడిమయట్లు(6–303), పిడుగడచిన క్రియ (6–303), బెబ్బులి మీసలురకయెవ్వాడు నేడూచికొనియె(6–315), నేలకుంగోలకుం దేవడం(7–96), చెవుల గొరవిగొని చూడినట్లు (7–118), మొదలు నరక నొరగు కదళిచందంబున(7–158), సడికంటె చావు మేలు (7–293)

ఎఱ్ఱన తన గురించి అరణ్య పర్యాంతమున “భవ్య చరిత్రుడు, గుణగరిష్టత నొప్పు ధన్యుడు, ధర్మైక తత్పరాత్ముడు, ధీర విచారుడు, సాధుజన హర్ష సిద్ధి గోరి కవీంద్ర కర్ణపుట పేయముగ “ పూరించనని చెప్పుకొనినాడు.
ఎఱ్ఱన ధర్మ తత్పరత ఆయన పూరించిన అరణ్యపర్వభాగములో చూడవచ్చు. ఉదాహరణకి సైన్ధవుడు ద్రౌపదిని చూచి మోహించిన సన్నివేశంలో తిక్కన శైలిలో రచించటమే కాక ధర్మనిరతి గురించి వివరించినాడు.

పరస్త్రీని అవమానించిన సైంధవుని…

“తల్లడపడి యరదమడిగి
విల్లను నమ్ములును విడిచి వెల్ల నగుచు మే
నెల్ల జెమర్పగ నూర్పులు
పెలుగ నమ్మనుజ పశువు పెలుంచం బఱచెన్”

కవి తను చూపవలసినవి, చూపేటి సందర్భములిటువంటివే ..

నృసింహ పురాణ అవతారికలో ఎఱ్ఱన ఇలా చెప్పుకుంటాడు. తన తాత అయిన ఎఱ్ఱపోతసూరి కలలో కనిపించి  “ప్రబంధ పరమేశ్వరుడనంగ నరణ్యపర్వ శేషోన్నయమంధ్రభాష నుజనోత్సవ మొప్పగ నిర్వహించినావు.’ నృసింహుని మీద కూడా పురాణము రచించమని అడిగెనట.  తాత కోరిక తీర్చ నృసింహపురాణము రచించెను. ఈ నృసింహ పురాణం పీఠికలో  ‘ప్రబంధ పరమేశ్వరు’ దన్న బిరుదు నామము ప్రస్తావన వుంది.

ఈ పురాణమును సైతం ప్రబంధములా రచించిన ఘనత ఎర్రనకే దక్కుతుంది.
శ్రీ పింగళి లక్ష్మీ కాంతం గారు తన గౌతమ వ్యాసములో "పురాణ రచన సయితము వర్ణనా ప్రాధాన్యమును నెలకొల్పిన మొదటి కవి ఈతడే. వర్ణనాత్మకము, ఆధునికము అగు శైలిలో నృసింహ పురాణమనెడి ఒక ప్రబంధమునే రచించి రాబోవు ప్రబంధ వృక్షమునకు బీజము నాటిన యుగకర్త. ఈ విధముగా ప్రబంధ కవిత్వ స్థాపనాచార్యుడు గనుకనే ఎర్రాప్రగడ 'ప్రబంధ పరమేశ్వరు'డను సార్థక నామము దాల్చెను." అంటారు.

ఎర్రన తొలుత రామాయణము రచించి ప్రోలయ వేమారెడ్డికి అంకితమిచ్చెను. తరువాత హరి వంశమును ఆతనికే అంకితమిచ్చెను.
నన్నయ కృతమగు అరణ్యపర్వ శేషభాగము నిస్వార్థముగా రచించి, దానిని కూర్చెను. ఆ నాటి నుంచే ఆంధ్రములో పూర్తి భారతమంతా సమగ్ర స్వరూపముగా వచ్చెను. ఇలా అష్టాదశ పర్వములన్నీ యొక 'మహా ప్రబంధం' కాగా దానికి 'పరమేశ్వరు'ని వంటి వాడు ఎర్రన అయ్యాడు. కాబట్టి ఎర్రనకు అరణ్యపర్వశేషము పూరించినందున 'ప్రబంధ పరమేశ్వరు'దన్న బిరుదు నామము కలిగింది.

ఎర్రన సకల భాషాకవిత్వ కోవిదుడు, శ్రీకంఠ చరణ సేవకుడు,శంభుదాసుగా, వైకుంఠగుణావధాన వర్ణన నిపుణుడై శ్రీమహావిష్ణు మహిమలు వర్ణించిన 'ప్రబంధపరమేశ్వరు'డై ఆంధ్రభాషకు చెప్ప లేనంత సేవ చేశాడు. భక్తి ప్రభోదం, దేశీయత, సంస్కృతాంధ్రాసమ్మేళనం, శైలి సాత్వికత, పదాల ఎన్నికలో సాత్వికత, కనబడుతాయి.
భారతము పూరించి ఆంధ్ర శారదకు కంఠాభరణము తొడిగాడు. తరువాతి కవులకు మార్గదర్శిగా నిలచాడీ 'ప్రబంధపరమేశ్వరుడు'.

Ref

సమగ్ర ఆంధ్ర సారస్వతం – ఆరుద్ర
ఆంధ్రకవి నక్షత్రమాలిక ఎఱ్ఱాప్రగడ — పి. యశోదారెడ్డి

COMMENTS